పన్ను బకాయిదారులకు ఊరట

- ఒకేసారి బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ
- సకాలంలో పన్ను చెల్లింపుతో రాయితీలు
- పన్నుల వసూళ్లకు జీవీఎంసీ ప్రత్యేక డ్రైవ్
- ఈ నెల 31తో ముగియనున్న గడువు


అక్కయ్యపాలెంలో ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న సచివాలయ సిబ్బంది


శ్రీనివాసనగర్‌లో బకాయి వివరాలు వెల్లడిస్తున్న ఆర్వో రాజ్యలక్ష్మి, సచివాలయ అడ్మిన్ శివకృష్ణ

సీతంపేట: రోడ్లు, డ్రైయిన్లు, వీధిలైట్లు, తాగునీటి సరఫరా, చెత్త తరలింపు ఇలా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో అందివ్వాలంటే రెవెన్యూ అవసరం. నిర్వహణ, అభివృద్ధి పనులు చేపట్టాలంటే ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలి. ఆర్థిక ఏడాది ముగుస్తుండటంతో పన్నుల వసూళ్ల కోసం జీవీఎంసీ యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. డీఫాల్టర్ లిస్టు ప్రకారం వార్డుల్లో సచివాలయాల వారీగా అడ్మిన్లు, కార్యదర్శులు పన్ను సకాలంలో చెల్లించాలని ఇంటింటికీ వెళ్లి ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రచారం చేస్తున్నారు. ఎప్పటి నుంచి ఎంత మొత్తంలో పన్ను చెల్లించాలి, ఎక్కడ చెల్లించాలి, గడువు తేదీ, వడ్డీ మాఫీ తదితర విషయాలను తెలియజేస్తున్నారు. ప్రతి వార్డులో ఆటోలో మైక్ ద్వారా విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. ఈ నెల 31లోగా ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, ట్రేడ్ లైసెన్స్, వ్యాపార, వాణిజ్య సముదాయాలు పన్ను చెల్లించి జీవీఎంసీకి సహకరించాలని జోన్-5 రెవెన్యూ ఆఫీసర్ ఐ.బాబూరావు కోరుతున్నారు.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ రాయితీ..

ఆస్తి, ఖాళీ స్థలాలపై పన్ను బకాయిలు ఈ నెల 31లోగా ఒకేసారి చెల్లిస్తే వాటిపై విధించిన వడ్డీ మాఫీ చేస్తున్నట్టు ప్రభుత్వం జీవో నంబర్ 34 ద్వారా ప్రకటించింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నెల 31 వరకు వడ్డీ రాయితీ వర్తిస్తుంది. ఎన్నేళ్ల పన్ను బకాయి ఉన్నా అంతా ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ సౌలభ్యాన్ని పొందవచ్చు. కరోనా ప్రభావంతో మూడేళ్ల పాటు చాలా మంది పన్ను చెల్లింపులకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారికి ఊరటనిచ్చేలా ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తూ అవకాశం కల్పించింది.

జోన్-5లో అసెస్‌మెంట్ల వివరాలు..

- జీవీఎంసీ జోన్-5 పరిధిలో ఇంటి పన్ను అసెస్‌మెంట్లు 99,212 ఉండగా.. ప్రస్తుత సంవత్సరం పన్ను వసూలు రూ.51.35 కోట్లు కాగా.. ఇప్పటి వరకు రూ.38.18 కోట్లు వసూలైంది. రూ.13.17 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ప్రతి రోజూ కోటి రూపాయలు పన్ను వసూలు లక్ష్యంగా జోన్-5 యంత్రాంగం కృషి చేస్తోంది.
- గతేడాది లెక్కల ప్రకారం జోన్ పరిధిలో వీఎల్టీ అసెస్‌మెంట్లు 1645 ఉండగా.. పాత బకాయిలు, ఈ ఏడాది పన్నుతో కలిపి సుమారు రూ.32 కోట్లు పన్ను వసూలు లక్ష్యంగా ఉంది.
- నీటి పన్ను అసెస్‌మెంట్లు 51,726 ఉండగా.. సుమారు రూ.15 కోట్లు పన్ను వసూలు కావాల్సి ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.4.08 కోట్లు వసూలు కాగా, ఇంకా 11.31 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

పన్ను చెల్లింపు కేంద్రాలు, ఫ్లాట్‌ఫామ్‌లు

ఏ వార్డు సచివాలయంలోనైనా పన్ను చెల్లించవచ్చు. నగదు గాని, యూపీఐ పేమెంట్ ద్వారా గాని చెల్లించే సదుపాయం ఉంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాలు, జ్ఞానాపురం జోన్-5 కార్యాలయంలోని సౌకర్యం సెంటర్‌లో పన్ను చెల్లించవచ్చు. ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో పే చేయవచ్చు. సీడీఎంఏ పోర్టల్‌లో 'విశాఖపట్టణం.ఈమున్సిపల్.ఏపీ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్‌లో టాక్స్ అసెస్‌మెంట్ నంబర్ లేదా డోర్ నంబర్ ఎంటర్ చేసి నెట్ బ్యాంకింగ్, కార్డుల ద్వారా పన్ను చెల్లించవచ్చు. పేటీఎంలో కూడా పేటీఎం.కామ్/మున్సిపల్ ద్వారా చెల్లింపు చేయవచ్చు.

సకాలంలో పన్నులు చెల్లించండి



ప్రజలు పన్నులు సకాలంలో చెల్లిస్తే జీవీఎంసీ పరిధిలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు కల్పించడానికి వీలుగా ఉంటుంది. ఈ నెల 31లోగా పన్నులు చెల్లించాలని స్పెషల్ డ్రైవ్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నాం. కోర్టు కేసుల్లో ఉన్న 64 అసెస్‌మెంట్లకు సంబంధించి పన్ను బకాయి లక్షల్లో పెండింగ్‌లో ఉంది. వారిని కలిసి ఈ నెలాఖరులోగా ఒకేసారి బకాయి చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని వివరిస్తున్నాం. కొంతమంది అంగీకరించారు. జోన్ పరిధిలో అతి పెద్ద పన్నుదారైన విశాఖ పోర్టు ట్రస్టును కూడా సంప్రదించాం. ఈ నెలాఖరులోగా లక్ష్యాన్ని సాధించడానికి అన్ని విధాల కృషి చేస్తున్నాం. – ఐ.బాబూరావు, రెవెన్యూ ఆఫీసర్, జీవీఎంసీ జోన్-5

మహిళల రక్షణకు పోష్ చట్టం


మాట్లాడుతున్న డాక్టర్ ఉషా

సీతంపేట: పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు జరగకుండా, వాటి నుంచి రక్షించడానికి భారత ప్రభుత్వం పీవోఎస్‌హెచ్(పోష్) చట్టాన్ని రూపొందించిందని సీఐఐ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఉషా పంతుల అన్నారు. ఫ్యూచర్ ఆఫ్ వర్క్ స్పేసెస్ అనే అంశంపై డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ఆదివారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. పోష్ చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మహిళా ఉద్యోగులకు సురక్షితమైన పని వాతావరణం కల్పించడం యజమానులకు ఈ చట్టం తప్పనిసరి చేస్తుందన్నారు. లైంగిక వేధింపుల ఫిర్యాదులను పరిష్కరించడానికి సంస్థల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలతో అభ్యంతరకరంగా మాట్లాడినా చట్టం ప్రకారం నేరంగా పరిగణిస్తారని చెప్పారు. చట్టం పరిధిలోకి వచ్చే అంశాలు, ఎలా ఫిర్యాదు చేయాలి, ఏ విధంగా రక్షణ పొందాలి తదితర అంశాలపై డాక్టర్ ఉషా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, వి.రాధాదేవి, శివజ్యోతి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల వనభోజనాలు


ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఏర్పాటు చేసిన బస్సు వద్ద సత్యసాయినగర్ డ్వాక్రా మహిళలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయి నగర్ కొండవాలు ప్రాంతం(భీమిలి నియోజకవర్గ పరిధి) డ్వాక్రా మహిళలు, స్థానికులు ఆదివారం వన భోజన, విహార యాత్ర మహోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఉచితంగా బస్సు ఏర్పాటు చేయగా, వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణలు తమ వంతు సహాయ సహకారాలు అందజేసినట్లు సత్యసాయినగర్ కాలనీ అధ్యక్షుడు కారుకొండ రాజుయాదవ్ తెలిపారు.

ముస్లిం వివాహ పరిచయ వేదికకు స్పందన


పరిచయ వేదిక కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ హైదర్ ఆలీ సింకా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ముస్లిం వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. నగరంతోపాటు ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ముస్లిం కుటుంబాలు పాల్గొన్నాయి. వధూవరుల తల్లిదండ్రులు వారికి కావలసిన అర్హతలను బట్టి తమ పిల్లలకు సంబంధాలను ఏర్పాటు చేసుకున్నారు. హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ వివాహ పరిచయ వేదికలను ఇప్పటి వరకు మూడు సార్లు ఏర్పాటు చేశామని, ఇది నాలుగోదని తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా భోజన సదుపాయం కల్పించామని, కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు తమ సొసైటీ తరఫున షాదీ ఖర్చులు కూడా భరించి ఉచితంగా వివాహాలు జరిపించేందుకు కమిటీ నిర్ణయించిందని చెప్పారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌కు సత్కారం

ఇటీవల విశాఖ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమితుడైన వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.వి.బాబాను సొసైటీ ప్రతినిధులు, ముస్లిం పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మీర్ అబ్బాస్ హుస్సేన్, సయ్యద్ అమీర్ జాన్, మహబూబ్ అలీఖాన్, షేక్ అహ్మద్ వల్లీ, షేక్ అబ్దుల్ మునీర్, మహమ్మద్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్ఐ వెంకటరావు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లకు ఎస్ఐ పలు సూచనలిచ్చారు. వారి దినచర్య గురించి అడిగి తెలుసుకున్నారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎలాంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీ షీటర్లకు ఎస్ఐ వెంకటరావు సూచించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు అభిషేకాలు


విశేష అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఫాల్గుణ మాసం ద్వాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నేతృత్వంలో పూజారి శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు సరైన నీడ లేక వర్షానికి తడిసి ముద్దయిపోయారు. మౌలిక వసతులు కల్పించాలని పలువురు భక్తులు కోరారు.

నూకాంబికకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ వద్ద దేవేంద్రనగర్ రవీంద్రనగర్‌లో వెలసిన నూకాంబికా అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ధర్మకర్త దేవల కృష్ణరాజు నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఘటాల సంబరాన్ని ఆయన ప్రారంభించారు. కంచరపాలెం మెయిన్ రోడ్డు నుంచి ఊర్వశి కూడలిలోని నూకాంబిక ఆలయం వరకు పలు నృత్యాలతో అమ్మవారి విగ్రహంతోపాటు దీపం, బెత్తం, పోతురాజు(కత్తి), జల్లెడ, పూల ఘటాలను ఊరేగించారు. ఆలయం వద్ద భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కె.రాము, ఎ.ధనరాజ్, కె.రవి, త్రివేణి, మహేష్, సభ్యులు పాల్గొన్నారు.

జోరు వాన

సీతమ్మధార: నగరంలో శనివారం అర్ధరాత్రి నుంచి కురిసిన జోరు వానకు సీతమ్మధారలోని రహదారుల్లో నీరు నిలిచిపోయింది. మెయిన్ రోడ్డులోని ఆంధ్రా బ్యాంక్ బయట, అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నీరు చేరింది. సీతమ్మధార రైతుబజారులో కూరగాయల విక్రయాలు సాగక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, కేఆర్ఎం కాలనీల్లోని కాలువలు, గోతుల్లో నీరు చేరిపోవడంతో స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు.

నేటి నుంచి నూకాంబిక అమ్మవారి ఉత్సవాలు

అల్లిపురం: కొత్త అమావాస్య సందర్భంగా కొబ్బరితోటలోని శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయం, నేతాజీనగర్‌లో గల నూకాంబిక అమ్మవారి ఆలయాల్లో సోమవారం, మంగళవారం ఘనంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొత్త అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, ఘటాల ఊరేగింపు కొబ్బరితోట, నేతాజీనగర్, ఎస్‌వీపీ నగర్ ప్రాంతాల్లో జరుగుతాయన్నారు.

ముగిసిన యోగా మహోత్సవాలు


యోగా నేర్పిస్తున్న ఏయూ శిక్షకులు,


యోగాసనంలో ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రజలు

మద్రిపాలెం: మద్రిపాలెం ఆర్ అండ్ బీ జంక్షన్ దరి ఎఫ్‌సీఐ గొడౌన్ సమీపంలోని శ్రీరామచంద్ర మిషన్ ఆశ్రమంలో మూడు రోజుల పాటు నిర్వహించిన యోగా మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్ విశాఖ మెట్రో జోనల్ కో ఆర్డినేటర్ వి.ఆర్.ఎస్.నాగశర్మ మాట్లాడుతూ శ్రీరామచంద్ర మిషన్, భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సంయుక్తంగా ఈ నెల 17 నుంచి 19 వరకు ఏర్పాటు చేసిన యోగా శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. యోగాసనాలు, ప్రాణాయామం, ముద్రలు, యోగిక్ ట్రాన్స్‌మిషన్‌తో కూడిన హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన శిక్షణలో వెయ్యి మందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ యోగా డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ రమేష్, నిష్ణాతులైన వారి విద్యార్థులు శిక్షణ అందించారన్నారు. ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వపు ఇనీషియేటివ్ హర్ దిల్ ధ్యాన్, హర్ దిన్ ధ్యాన్ ప్రకారం నిర్వహించామని చెప్పారు. పెద్ద ఎత్తున ప్రజలు, విద్యార్థులు హాజరై ప్రయోజనాన్ని పొందినందుకు, విజయవంతంగా శిబిరం నిర్వహించినందుకు అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీరామచంద్ర మిషన్ విశాఖపట్నంలో 30కి పైగా ధ్యాన కేంద్రాలు ఉన్నాయని, ధ్యాన సాధన చేయడానికి లేదా కొనసాగించడానికి 96667 92133, 72075 75964 నంబర్లలో సంప్రదిస్తే వారివారి ప్రాంతాల్లో నిర్వాహకులు సేవలందించే ఏర్పాటు చేస్తామని నాగశర్మ వెల్లడించారు.

కేజీహెచ్‌లో నీటిశుద్ధి యంత్రం ఏర్పాటు


నీటిశుద్ధి యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఉషామాధవి

మహారాణిపేట: టచ్ స్టోన్ చారిటీస్, హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా కేజీహెచ్ సుభోజనం వద్ద నీటిశుద్ధి యంత్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ సేవలను గుర్తించి ఈ యంత్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. దీని ద్వారా రోజుకు 200 నుంచి 1000 లీటర్ల మంచినీరు రోగి సహాయకులకు అందుతుందని రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్‌కు చెందిన దత్త సుబ్బారావు తెలిపారు. తమకు సహకరించిన వారికి శ్యామ మాధవదాస ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ కపుల్స్ జిల్లా గవర్నర్ దత్త సుబ్బారావు, క్లబ్ వైజాగ్ సెక్రటరీ వి.ఉషామాధవి, అధ్యక్షుడు సుబోధ్‌కుమార్, హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు చెందిన యదు రాజాదాస, స్వచ్ఛంద సేవకులు కృష్ణారావు, టచ్ స్టోన్ చారిటీస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా 'ఐ లవ్ వైజాగ్'



సీతకొండ మలుపులో బీచ్ రోడ్డు సీ వ్యూ వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఐ లవ్ వైజాగ్ బోర్డు

ఆరిలోవ: విశాలాక్షినగర్ దరి సీతకొండ మలుపు వద్ద బీచ్‌రోడ్డులో జీవీఎంసీ ఏర్పాటు చేస్తున్న »ఐ లవ్ వైజాగ్«ఆకర్షణీయంగా నిలుస్తోంది. నగరంలో ఈ నెల 28, 29 తేదీలలో జరగనున్న జీ-20 సదస్సుల కోసం విశాఖ రానున్న వివిధ దేశాల ప్రతినిధులను ఆకట్టుకొనేలా నగరాన్ని సుందరీకరణ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బీచ్‌రోడ్డును అందంగా తీర్చిదిద్దుతున్నారు. సీతకొండ మలుపు వద్ద సీ వ్యూ పాయింట్‌లో ఐ లవ్ వైజాగ్ అనే విడి అక్షరాలను అమర్చారు. ఈ బోర్డులో రెండు డాల్ఫిన్ బొమ్మలను లవ్ సింబల్‌గా ఉపయోగించారు. వాటి కింద రంగులు వేయడానికి ప్రస్తుతం పలకలు అమర్చుతున్నారు. దీంతో ఈ బోర్డు అటుగా వెళ్లే వాహనచోదకులు, సందర్శకులను ఆకట్టుకుంటోంది. వారు అక్కడ ఆగి సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటున్నారు.

ఆపన్నులకు సాయం


అనాథలకు అన్నదానం చేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని లెబన్షిల్ లైఫ్ ఫౌండేషన్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మానసిక దివ్యాంగులు, అనాథలకు నిత్యావసర సరకులు, ఆశ్రమ నిర్వాహకుల వినతి మేరకు మిక్సీ, వెట్ గ్రైండర్ అందజేశారు. మధ్యాహ్నం కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ స్వహస్తాలతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపస్సు కాలంలో ఉపవాసంతో పాటు దానధర్మాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు డి.శ్రీను, చరణ్, సుధాకర్, కుమార్, ఆశ్రమ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత శిబిరానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు తరలి వెళ్లారు. డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలకు చెందిన అధ్యాపకుడు డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు ప్రోగ్రాం అధికారిగా ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒడిశా రాష్ట్రం పూరీలో ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరంలో ఏయూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వారిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థులకు నేత్ర పరీక్షలు


విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థినుల వసతి గృహంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య పరీక్ష శిబిరం నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని వసతిగృహంలోని విద్యార్థినులకు నేత్ర పరీక్షలు చేసి, అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ ఆచార్య సిహెచ్.ఆశా ఇమ్మానియల్‌రాజు, వార్డెన్ డాక్టర్ రాజమాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సాధనతో మానసిక ప్రశాంతత


ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో యోగా చేస్తున్న సాధకులు


ఉపన్యసిస్తున్న ఆచార్య జ్యోతిప్రకాష్

ఆరిలోవ: యాంత్రిక జీవనంలో ఆధ్యాత్మిక సాధనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆనంద్ మార్గ్ సీనియర్ ఆచార్య జ్యోతిప్రకాష్ అవధూత అన్నారు. జీవీఎంసీ 10వ వార్డు డెయిరీ ఫారం దరి ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ ఆధ్యాత్మిక సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలలో ఆనంద్‌మార్గ్ ఆశ్రమాల నుంచి వచ్చిన ఆచార్యులు ఇక్కడ ఉచిత యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేశారు. వారితో పాటు నగరానికి చెందిన కొందరు సాధకులు కూడా ఈ శిబిరంలో పాల్గొని యోగా సాధన చేశారు. ముగింపు సందర్భంగా ఆచార్య జ్యోతి ప్రకాష్ మాట్లాడుతూ మనిషి సంపూర్ణ ఎదుగుదలకు ఆధ్యాత్మిక సాధనతో పాటు సామాజిక సేవలు కూడా అవసరమన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది సన్యాసులు, మరో 150 మంది ఆనంద్‌మార్గ్ ఆశ్రమాల సభ్యులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పరమేశ్వర ఆనంద్ అవధూత, సౌమ్యానంద్, సుశ్రుతానంద్, ఇష్టప్రేమ, అనిమిష ఆనంద్, శుచిలేక ఆనంద్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో డంపర్ బిన్లు



రేసపువానిపాలెంలో శిథిలమైన డంపర్ బిన్


నక్కవానిపాలెంలో డంపర్ బిన్ దుస్థితి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. రేసపువానిపాలెం, నక్కవానిపాలెం శ్మశానవాటిక ఎదురుగా రోడ్డుపై ఉన్న డంపర్ బిన్లు పాడై మరమ్మతులకు నోచుకోని పరిస్థితి నెలకొంది. వాటిలో వేసిన చెత్త బయటకు రావడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. వారం రోజులుగా ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నా పారిశుధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

తెలుగు పాటకు ఆస్కార్ గొప్ప విషయం


కార్యక్రమంలో పాల్గొన్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడం సంతోషించదగ్గ విషయమని గోపాలపట్నం కళా సేవా పీఠం అధ్యక్షుడు గౌరకల రామదాసు అన్నారు. గోపాలపట్నంలోని పీఠం కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆస్కార్‌తో తెలుగు చిత్ర కీర్తి విశ్వ వ్యాప్తమైందన్నారు. సభ్యులు జి.అప్పారావు, డి.సింహాచలం నాయుడు, వెంకట్, శ్రీనివాసరావు, నూక రాజేశ్వరరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

మాతృమూర్తులకు సన్మానం


మాతృమూర్తులను సత్కరిస్తున్న గీతా మకరందం సభ్యులు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ట్రాఫిక్ విభాగం డీహెచ్‌టీకి చెందిన గీతా మకరందం సభ్యులు సీహెచ్ మసేను, నక్కా అప్పారావు, జి. ధనరాజు గత ఐదేళ్లుగా మాతృమూర్తుల సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మాతృమూర్తులను సన్మానించారు. బి. దేవుడు, డి. ఎల్లారావు, నర్సింగరావు, పిల్లి రమణ, వాసుపల్లి కోదండరావు, పోలవరపు నూకాలమ్మ దంపతులతో పాటు 40 మంది మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. మాతృదేవోభవ పేరిట జరిగిన ఈ కార్యక్రమం అనంతరం అన్నసమారాధన చేపట్టారు. స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.